క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పార్వతీపురం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని గ్రీన్‌కోర్ సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం మండలంలోని డోకిశీల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ వారి ఇళ్ల పరిధిలో మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం



ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలను వినియోగించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు మండలంలోని అప్పయ్యపేటలో శుక్రవారం సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది కలిసి ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి రోగాన్నైనా నివారించడానికి తమ వంతు సహాయం అందించేందుకు కృషి చేస్తామని అందుకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. ఈ క్రమంలో 104 వాహనంలో గర్భిణులు, ప్రజలకు 88మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, సభ్యులు

సాలూరు: ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని మున్సిపాలిటీ కౌన్సిల్ సభ్యులు కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వార్డుల్లో తిష్ట వేసిన పలు సమస్యలను ప్రస్తావించారు. డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, పారిశుధ్య పనుల నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జీడి మొక్కల పంపిణీ



రైతులకు జీడి మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజన రైతులకు శుక్రవారం జీడి మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని వెంకట భైరిపురంలో సర్పంచ్ ఎం.వెంకటరత్నం చేతుల మీదుగా 300 జీడి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఆదాయం, ఆరోగ్యం అందించే మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ వెంకటరత్నం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని పెంపొందించాలని సూచించారు.

చిరుధాన్యాల యూనిట్ల ఏర్పాటు

భామిని: మండలంలోని బండ్రసింగి, ఏతంగూడ గిరిజన గ్రామాల్లో చిరుధాన్యాల ప్రాసెస్ యూనిట్లను హెచ్‌డీఎఫ్‌సీ ఆర్థిక సహాయంతో శుక్రవారం ప్రారంభించారు. వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల ఆర్థిక ప్రయోజనాల నిమిత్తం వీటిని ఏర్పాటు చేసినట్టు సంస్థ ఇన్‌చార్జి రవీంద్ర తెలిపారు. పరివర్తన పథకంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో ఆధునిక యంత్ర సామగ్రి ఏర్పాటు చేస్తున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులు అమిత్, నీరజ్ తెలిపారు. చిన్న మూలగూడలో గిరిజనులతో నిర్వహిస్తున్న నాటుకోళ్ల ఫారం యాజమాన్య పద్ధతులపై మహిళలతో చర్చించారు. బొడ్డగూడలో సేంద్రియ సాగు యూనిట్, బయో రిసోర్సు సెంటర్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. చిరుధాన్యాల సాగుపై ఆరా తీశారు. పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

కోటి కుటుంబాలకు ప్రభుత్వం సేవలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జగనన్న సురక్ష ద్వారా కోటి మంది కుటుంబాలకు సేవలు అందించిన ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల కొత్తవలగాం 8,9 సచివాలయాల పరిధిలోని 15, 16, 17,18 వార్డులకు చెందిన ప్రజలకు జగనన్న సురక్ష క్యాంప్ ద్వారా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు ఆధ్వర్యంలో బంగారమ్మ కాలనీ ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2 వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంప్ ద్వారా జారీ చేసిన 11రకాల ధ్రువీకరణ పత్రాలను అర్జీ పెట్టుకున్న సుమారు 600 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక వార్డుల కౌన్సిలర్లు సంగంరెడ్డి లక్ష్మిపార్వతి, చీకటి అనురాధ, నిమ్మకాయల సుధీర్, తాడ్డి శంకరరావు, ఎస్.లావణ్య, పి.జయంతి, వి.నేతాజీ, జేసీఎస్ కన్వీనర్ జి. మాధవరావు, కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, సచివాలయం కన్వీనర్లు గొర్ల పద్మావతి, గోగు గాయత్రి, బోను ఆదినారాయణ, మరడాన తవిటినాయుడు, ఎస్.సందీప్, ఎస్.చంద్రలతో పాటు మున్సిపల్ ప్రత్యేక అధికారి, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో బహుళప్రయోజనాలు

సీతానగరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలను చేకూర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.శ్రీనివాసరావు సచివాలయ కన్వీనర్లు బి.గౌరునాయుడు, బి ముకుందరావు, డి.నాగరత్నంతోపాటు వి.పారినాయుడు, వై.గోపాలనాయుడు, రెడ్డి అప్పలనాయుడుల సమక్షంలో లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కుమారవర్మ, ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, వైద్యారోగ్య, ఉపాధి, పీఆర్ శాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: సర్టిఫికెట్స్ పంపిణీ చేస్తున్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు

వారం రోజుల్లో రైస్‌కార్డు అందింది



నాకు వివాహమైన నాటి నుంచి రైస్‌కార్డు మంజూరు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు, జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు మా ఇంటికి వచ్చినపుడు రైస్‌కార్డు ఇవ్వాలని కోరాను. ఆధార్ నంబర్. కుటుంబ సభ్యుల వివరాలు ఇచ్చిన నాలుగు రోజుల్లో రైస్ కార్డు మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

– మరిశర్ల సత్యవతి, వెంకటాపురం

దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ శ్యామ్ కుమార్

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా దోమలు ప్రబలుతున్నందున వాటి నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా మలేరియా నివారణాధికారి శ్యామ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఏగోటివలసలో పరిసరాల పరిశుభ్రతపై ఏఎంఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని వీధుల్లో ఖాళీ కొబ్బరి బురికెలు, వాహనాలనుంచి తీసేసిన టైర్లున్న ప్రాంతాలతో పాటు నీరు నిల్వ ఉన్న కాలువల్లో దోమలు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. దోమలను సామూహికంగా నివారించడానికి చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దోమలు ప్రబలడం వల్ల రాత్రిపూట నిద్రలో ఉన్న సమయంలో కుట్టడంతో జ్వరాల బారిన పడాల్సి వస్తుందన్నారు. దోమల నివారణకు పంచాయతీ పాలకులు మందు పిచికారీ చేయాలని కోరారు. బోర్లకు తగిలించిన టైర్లు తక్షణమే తొలగించాలని, తీసేసిన టైర్లు ఖాళీ కొబ్బరి బురికెలను దూర ప్రాంతంలో వేయాలని లేదా మంటపెట్టి కాల్చివేయాలని సూచించారు. దోమల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.అనంతరం కాలువలు, బోర్లను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గోపాలరావు, వైద్యసిబ్బంది వెంకటేష్, బి.రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కె.హరిప్రియ పాల్గొన్నారు.

దోమల నియంత్రణ చేపట్టాలి

పార్వతీపురంటౌన్: ఇంటి పరిసరాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా కాలానుగుణ వ్యాధులను నివారించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాలగుడబ గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటి ఆవాసాల్లో ఉపయోగంలో లేని కుండీలు, పాడైన వస్తువుల్లో ఉన్న నీటి నిల్వల తొలగింపును పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ఈ విధంగా ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలున్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, ముఖ్యంగా వర్షాకాలం కావడం వల్ల పరిసరాల్లో మరింత నీరు చేరి నిల్వ ఉండటం వల్ల దోమలు పుట్టడానికి ఆవాసాలుగా మారతాయని తద్వారా మలేరియా, డెంగీ మొదలగు సీజనల్ వ్యాధులు ప్రబలతాయని చెప్పారు. కాబట్టి ముందస్తు చర్యలు, జాగ్రతలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.శ్రీకాంత్, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్యసిబ్బంది జగదీష్, రామలక్ష్మి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

సంక్షేమానికి సాక్షి మీరే



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు
- చిలకలపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

బలిజిపేట: పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందుకుంటున్న ప్రజలే ఆయన పాలనకు సాక్షులని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని చిలకలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బుక్‌లెట్ అందించి వారికి ఏయే పథకాలు అందాయో తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటప్రకారం అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. లబ్ధిదారులు ఏపార్టీలకు చెందిన వారైనా సంక్షేమ పథకం అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఇంటింటికీ పథకాలను చేరువచేసే బాధ్యతను వలంటీర్లకు అప్పగించడంతో నేరుగా లబ్ధిదారుకే వారు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పొందుతున్న మీరే ఈ ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తూ, అభివృద్ధి పనులను చేపడుతున్న సీఎం జగన్‌మోహన్ పాలనకు మీరే సాక్షులని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఇటువంటి సీఎంను తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. వలంటీర్లు, సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనపై తప్పుడు కూతలు కూస్తున్న వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీటీసీ మల్లిక, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాద్, సీహెచ్.శ్రీను, జగన్నాథం మాస్టారు, ఆర్.సంజీవి, రామారావు, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఎం.దుర్గేశ్వరి, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, బలిజకార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కె.మోహనరావు, ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీలు సాంబమూర్తి, రామకృష్ణనాయుడు, జి.జగన్, శ్రీనివాసరావు, జి.సత్యంనాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలు

- డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



బలిజిపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

బలిజిపేట: ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు మంచి సత్ఫలితాలనిస్తున్నాయని డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బలిజిపేట పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు 29గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుతున్నాయని, నెలకు 700క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో పారిశుధ్య పనులపై కొత్తగా దృష్టి సారించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ వంటి వాటిపై దృష్టి సారిస్తున్నామన్నారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలపై ఎక్కువ దృష్టి సారించాలని సిబ్బందికి సూచించామని. అందుకు ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. మన్యం జిల్లాలో 80శాతానికి పైగా ప్రభుత్వ హాస్పటల్స్‌లో ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. పీహెచ్‌సీల్లో 172రకాల మందులు, 60రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్‌ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరుకుల తూకం పక్కాగా ఉండాలి

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు



పార్వతీపురంటౌన్: రేషన్ సరుకుల తూకం పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి చౌక ధరల డీలర్లకు, చౌక ధరల డీలర్ల నుంచి రేషన్ కార్డు దారులకు అందే సరుకుల్లో ఎటువంటి తేడాలు ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని ఎనిమిది ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌ల పరిధిలో ఉన్న రేషన్ షాప్‌లకు శతశాతం సరుకులను రేషన్ డీలర్ సమక్షంలో తూకం వేసి అప్పగించాలని, అదేవిధంగా రేషన్ డీలర్లు సంబంధిత ఎండీయూ ఆపరేటర్లకు శత శాతం తూకంతో అప్పగించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సార్టెక్స్, ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేస్తున్నట్లు కార్డు దారులకు తెలియజేస్తూ వాటిలో ఉన్న పదార్థాలు-ఐరన్, ఫోలిక్, విటమిన్ బి12 అవశ్యకతను తెలియజేయాలని సూచించారు. ఎంఎల్ఎస్ స్థాయిలో గాని, రేషన్ షాప్ స్థాయిలో గాని, ఎండీయూ ఆపరేటర్స్ స్థాయిలో గాని తూనికలో తేడాలు గమనిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పనుల జాబితా సిద్ధంగా ఉంచాలి



ఐటీడీఏ పీఓ నిర్వహిస్తున్న సమీక్ష సమావేశం

పార్వతీపురం: ఉపాధిహామీ పనులను కల్పించేందుకు జాబితా సిద్ధంగా ఉంచాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. ఉపాధిహామీ, ఇతర పనులపై తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో వేతనదారుల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రతి ఒక్కరికీ కనీస వేతనం వచ్చేలా చూడాలని సూచించారు. గృహనిర్మాణంలో 90రోజులు పనిదినాలు కల్పించాలని స్పష్టం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని కోరారు. సామాజిక ఆడిట్ కార్యాచరణ ప్రణాళిక ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, గిరిజనసంక్షేమ సాధికారిత అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ తీరుపై ఆగ్రహం

- మండల సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు



ఏఈని ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సాంబమూర్తి

బలిజిపేట: విద్యుత్‌శాఖ పని తీరుపై ఎంపీటీసీ సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై సమీక్ష చేశారు. పెద్దింపేటలో విద్యుత్ సమస్యలు ఉన్నాయని గత సమావేశంలో ప్రస్తావిస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు నేటివరకు పరిష్కరించకపోవడంపై ఎంపీటీసీ సాంబమూర్తి ఏఈ సింహాచలంపై ఆగ్రహించారు. జగనన్న కాలనీకి విద్యుత్ స్తంభాలు వేయిస్తామని గతంలో చెప్పినా నేటికి వేయించలేదని, గ్రామంలో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగితే సరిచేసే దిక్కే లేదని, స్తంభాలు పాడైనా మార్పుచేయడం లేదని ప్రశ్నించారు. గంగాడలో జగనన్న లేఅవుట్‌కు 14విద్యుత్ స్తంభాలు అవసరం లేకపోయినా ఏవిధంగా వేశారని ఎంపీటీసీ సూర్యనారాయణ ప్రశ్నించారు. నారాయణపురంలో విద్యుత్ స్తంభాలు పాడైనవి ఉన్నప్పటికీ ఎందుకు మార్చలేదని ఎంపీటీసీ రామకృష్ణనాయుడు ప్రశ్నించారు. ఈ సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తామని ఏఈ సమాధానమిచ్చారు.

ఎంఆర్‌సీకి నిధులు మంజూరు చేయించాలి

ఏఓ అశోక్ మాట్లాడుతూ వచ్చేనెల 1వ తేదీ నుంచి ఈ-క్రాప్ నమోదు జరుగుతుందని అందరూ సహకరించాలని కోరారు. ఎంఈఓ సామల సింహాచలం మాట్లాడుతూ మండలంలో 42పాఠశాలలకు సంబంధించి 10రకాల నాడు-నేడు పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలో 20సచివాలయాల పరిధిలో 4,864మంది విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలో డ్రాపవుట్స్ లేకుండా చేస్తామని చెప్పారు. ఎంఆర్‌సీ భవనం శిథిలావస్థలో ఉందని దానికి నిధులు మంజూరుచేయించి నూతన భవన నిర్మాణం చేయించాలని ప్రజాప్రతినిధులను కోరారు. భూ సర్వే మొదటి విడతలో 7గ్రామాలలో పూర్తయి రైతులకు హక్కు పత్రాలు అందజేశామని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. రెండవ విడతలో 10గ్రామాలకు గాను 9 గ్రామాలలో సర్వే పూర్తయిందని 7గ్రామాలకు చెందిన భూహక్కు పత్రాలు వచ్చినట్లు చెప్పారు. వాటిని త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, ఉపాధ్యక్షులు వి.సాయిరాం, బి.హేమలత, ఏఓ భానుమూర్తి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళల పోరాటయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి

పార్వతీపురంటౌన్: హింసపై మహిళల పోరాట యాత్ర రాష్ట్ర జాతాను జయప్రదం చేయాలని ఐద్వా పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో హింస రోజురోజుకూ పెరుగుతుందని ఢిల్లీలో మహిళా మల్లయోధులు చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనమన్నారు. మహిళల పట్ల హింసను అరికట్టేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కేంద్ర ప్రభుత్వంపై పోరాటయాత్ర చేపట్టినట్లు తెలిపారు. జూలై 29వ తేదీన మధ్యాహ్నం జిల్లాలోని పాలకొండలో, సాయంత్రం పార్వతీపురం, సీతానగరం సాలూరులకు రాష్ట్ర జాతా వస్తుందని పేర్కొన్నారు. మహిళలు, అభ్యుదయవాదులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎం.గౌరి, బి. జయలక్ష్మి, వి.ఇందిర, జి. తులసి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు

మక్కువ:

జగనన్న సురక్ష కార్యక్రమంతో మిగిలిపోయిన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని చెముడు గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రంగునాయుడు పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాలు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంగు రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు చింతల గోపాలకృష్ణ , మాజీ సర్పంచ్ బొంగు భీమలింగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



చెముడులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న రంగునాయుడు

31న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

పార్వతీపురంటౌన్: ఈ నెల 31న పార్వతీపురం పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే జోగారావు, చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించి అజెండాను రూపొందిస్తున్నామని తెలియజేశారు.

ఇనుప చక్రాల ట్రాక్టర్లను నడపవద్దు

వీరఘట్టం: రహదారుల భద్రతకు ముప్పు కలిగిస్తున్న ఇనుప చక్రాలతో ఉన్న ట్రాక్టర్లను రహదారులపై నడపవద్దని ఎస్.ఐ ఎంవీ రమణ సూచించా రు. శుక్రవారం ఓ ఇనుప చక్రాల ట్రాక్టర్ రహదారి ని ఛిద్రం చేస్తూ రావడాన్ని గమనించి ఆ ట్రాక్టర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌కు అవగాహన కల్పించారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రహదారులు నిర్మిస్తుంటే మీరు ఇలా ట్రాక్టర్లు నడిపి రోడ్డును పాడు చేస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోండి, రోడ్లను మాత్రం పాడుచేయవద్దని కోరారు.